"తిక్కన కాలమున ఆంధ్రదేశమునంతను పాలించిన కాకతీయులు పరమమాహేశ్వరులై యుండుటచే శైవమునకు రాజాదరణము విస్తారముగా లభించెను, కానైతే కాకతీయులు వీరశైవులుకారు. బసవేశ్వరుని ఉపజ్ఞా ఫలితముగ శైవము వీరశైవముగామారి పరసమయములను సహింపక వానిపై ధ్వజమెత్తు పరిణామమునకు లోనయ్యెను. పాల్కురికి సోమనాథుని రచనల యందు తీవ్రవైఖరియే ప్రత్యక్షమగును. అప్పటి వైష్ణవ మింకను వీరశైవ మునకు ప్రతిద్వంది కాదగిన స్థితిలో లేకుండ వచ్చును. సోమనాథుడు విష్ణువు పేరు పేర్కొని ఆ దైవము శివునితో సమానుడు కాజాలడని నిరూపించుటకు వాదప్రకరణమున చాలగా రచించెను. అతడు వైష్ణవమును పేరెత్తి చెప్పక 'పాంచరాత్రులు', "భ్రాంతచిత్తుల"ని త్రోసి పుచ్చెను. అద్వైతులను 'నీతి వర్జితుల'ని ఖండించెను.

"దేశమునందు చెలరేగుచున్న మతసంబంధమైన అసహనమును ద్వేషమును ఉపశమిల్లునట్లు చేయుటకు కవిబ్రహ్మ సంకల్పించెను. హరిహరనాథ

కల్పన మాతనికి ఈ సదుద్దేశ్యమునందు మిక్కిలి సహకారి అయ్యెను. సామాన్య జనులకు హరిహరుల అభేదమును బోధించి వారిని శాంతచిత్తులను చేసెను. వ్యుత్పన్నమతులైన వారికి జీవేశ్వరాభేద రూపమైన వేదాంతమును ప్రతిపాదించెను. సాంఖ్య, యోగ సిద్ధాంతములను అద్వైతమునకు బాసటగా స్వీకరించెను. వీటన్నిటికిని భక్తి యోగమును మూలకందముగా గ్రహించెను."

"తిక్కన, హరిహరనాథ తత్త్వపటము నందలి కొన్ని ముఖ్యాతంతువులను గుర్తింతము. 1) వేదప్రామాణ్యము 2) కర్మప్రాధాన్యము 3) వేదవ్యాస సంస్తుతి 4) హరిహరుల కభేద సంకలనము - ఏకతానిరూపణము 5) సామాన్యస్తుతి 6) యోగము 7) సాంఖ్యము 8) అద్వైతము. హరిహరనాథ సంబోధనతో కూడిన ఆశ్వాసాంత పద్యము లందీ అష్టసూత్ర విధానమును తిక్కన అనుసరించెను. పెక్కు మతములనెడి అరణ్యమార్గముల సంచరించి మిక్కిలి శ్రమగొన్న మనస్సునకు ఉత్తమ సరళమార్గమును చూపగల తెరువరి హరిహరనాథ దేవుడు. అద్వైత సిద్ధాంత ప్రతిపాదనమునందు తిక్కన సోమయాజి తనకు మిక్కిలి సన్నిహితుడైన ఆచార్య శంకరుని ఎచ్చటను పేర్కొనలేదు. తిక్కన సోమయాజి బాదరాయణ మహర్షి ప్రోక్తమైన అద్వైతము నందు పరమప్రమాణ బుద్ధికలవాడు. మధ్యమాధికారులకు హరిహరనాథ రూపమును మూర్తముగ చిత్రించి చెప్పినను వేదాంత దృష్టితో ఆయన నిర్గుణ, నిష్క్రియ, శుద్ధపరబ్రహ్మ మనియే బహుధా ప్రపంచించి స్తుతించెను. తిక్కన మతములో మోక్షసిద్ధికి కేవల జ్ఞానము చాలదు. హరిహరాభేద జ్ఞానముకాని బ్రహ్మైక్యజ్ఞానము కాని భక్తి సహితమైనప్పుడే ఫలమునిచ్చును. భక్తిరహితమైన శుష్కజ్ఞానము ఫలసిద్ధి కావింపదని సోమయాజి నిశ్చయము."

ఇంత విపులముగా హరిహరనాథతత్త్వాన్ని గూర్చి చెప్పిన తెలుగు విమర్శకులు లేరంటే అతిశయోక్తికాదు. ఇప్పుడు డా॥ దివాకర్ల వేంకటావధానిగారి అభిప్రాయంలో తిక్కన హరిహరనాథు డెటువంటివాడో చూతము. "తిక్కన తనకాలమున వీరశైవులకును వైష్ణవులకును వర్తిల్లుచుండిన ద్వేష వైరములను జల్లార్చి వారికి సామరస్యము కల్గించుటకై హరిహరనాథుడను శివకేశవాద్వైతమూర్తిని గల్పించియుండుననియు, నతడు తద్భావనా కల్పితుడే కాని యట్టి దేవుడా రోజులలో జనారాధ్యుడై యుండుట విశ్వా

స్యము కాదనియు కొందఱు చెప్పుచున్నారు. మఱికొందఱు నెల్లూరున నిప్పుడ రంగనాథాలయ మున్నచోట నాకాలమున హరిహరనాథాలయ ముం వనియు, దిక్కన యందు గూర్చుండి భారతమును రచించియుండిన కతమున విరాటపర్వాదిని "ఈ దృశంబులగు పుణ్యప్రబంధంబులు దేవసన్నిధిం బ్రక సించుటయు నొక యారాధన విశేషంబగుటం జేసి" యని రచించెననియు చెప్పు చున్నారు. ఆ రోజులలో పెన్నానది రెండుపాయలై ప్రవహించు చుండె ననియు, నందొకపాయ నెల్లూరునకు దక్షిణముగా పాఱుచుండెననియు, దాని దక్షిణతీరమున నప్పుడు హరిహరనాథ దేవాలయ ముండెననియు, దాని శిథిలము లిప్పుడు కూడ గోచరించు చున్నవనియు, బైచరాజు వేంకటనాథుడు తన పంచతంత్రమును హరిహరనాథుని కంకితము చేసియుండుటచే నాతని కాలము (15 వ శతాబ్ది) వఱకు హరిహరనాథ దేవాలయము నెల్లూరున నుండినట్లు, భావింప వచ్చుననియు, పదునొకండవ శతాబ్దియందలి యొక ద్రాక్షారామ శాసనమువలన సప్తగోదావర సంగమమున నొక హరిహర దేవాలయ ముండినట్లు తెలియుచున్నదనియు కీ. శే. చాగంటి శేషయ్యగారు వ్రాసియున్నారు. తిక్కన హరిహరనాథుడు భావనారాధ్యుడని రెండుమూడు చోట్ల జెప్పినను అతని కాలమున నా దేవునికొక దేవాలయ మచ్చట నుండె నని భావించుటయే సమంజసముగా నుండును."[14] (విరాటపర్వ సంశోధిత ముద్రణ పీఠిక) (1970) (పుటలు 93–94)

సంశోధిత ముద్రణ చివరి సంపుటానికి 'భారతదేశము – శైవమతము, అను శీర్షికతో 11 పుటల వ్యాసం వ్రాస్తూ దివాకర్లవారు ప్రసక్తానుప్రసక్తంగా హరిహరనాథుని గూర్చి ప్రస్తావించినారు.

"బసవేశ్వరోపజ్ఞమైన వీరశైవము కర్ణాట దేశమందును, తదితర ప్రాంతములందును వ్యాపించుటకు ముందు శైవమతము భారతదేశమున నైదువిధములుగా నుండెను. 1) శుద్ధశైవము - కాశ్మీర శైవము 2) శైవ సిద్ధాంతము 3) మిశ్రశైవము 4) సామాన్య శైవము 5) వీరశైవము

14. ఉస్మానియా యూనివర్సిటీవారి విరాటోద్యోగపర్వముల సంశోధిత ముద్రణకు 'పీఠిక'లో దివాకర్లవారు వెలువరించిన పై అభిప్రాయము యథాతథముగా చాగంటి శేషయ్యగారి అభిప్రాయమే అయినందువల్ల దీనిని గురించి ప్రత్యేకించి చెప్పవలసినదేమియులేదు.

వీరశైవము బసవేశ్వరునితోనే యారంభించెనని పలువురు తలంతురుకాని - యాగమములను పరిశీలింప నది యాతకుముందే యుండినట్లు వ్యక్తమగును. "విశబ్దో వా వికల్పార్థే రశబ్దో రహితార్థకః, వికల్ప రహితం శైవం వీరశైవం ప్రచక్షతే" అని వీరాగమమును, "శివలింగం కరాద్యంగే వీరశైవస్తుధారయేత్" అని వాతూలాగమమును దెల్పుచున్నవి."

"క్రీ. శ. 6 వ శతాబ్దిలో దక్కను నందు శంకరభగవత్పాదుల అద్వైత మతము వ్యాపించుట - అప్పుడుండిన యితర మతము లన్నిటికి నాఘాత మయ్యెను. జైన బౌద్ధములతోపాటు శైవముకూడ కొంతవరకు క్షీణించెను ఈ క్షీణత కద్వైతమత వ్యాప్తితోబాటు రాజరాజనరేంద్రుని ప్రేరణమున నతనికి మిత్రుడును, కులబ్రాహ్మణుడునైన నన్నయభట్టు వ్యాసరచిత మహాభారతము నాంధ్రీకరింప నారంభించుటయు కొంతవరకు గారణమయ్యెను. తరువాత శ్రీమద్రామానుజుల వైష్ణవముకూడ వ్యాపించెను. కాని యది యంతగా ప్రాముఖ్యము బడయజాలదయ్యెను. ఇట్టి పరిస్థితులలో వీరశైవము ప్రాదుర్భవించుట జరిగెను."

"కల్యాణి చాళుక్య చక్రవర్తుల సామంతులలో నొకడైన బిజ్జలుడు క్రీ. శ. 12వ శతాబ్ది మధ్యభాగమున గొంత ప్రాభవము సంపాదించి స్వతంత్రత ప్రకటించెను. ఆయనకు బసవేశ్వరుడు ముఖ్యమంత్రిగా నుండెను. అతడు బిజ్జలుని జైనము నుండి శైవమునకు మార్చి యాతని సాహాయ్యముచే వర్ణాశ్రమాచారముల నంగీకరింపని వీరశైవమతమును వ్యాపింపజేసెను. అప్పటినుండియు వీరశైవము కన్నడదేశమున నధికముగా బ్రచారము పొంది క్రమముగా బరిసర ప్రాంతములకు గూడ వ్యాపించెను. తరువాత గొంతకాలమునకు తెలుగు దేశమున పాల్కురికి సోమనాథుడను కవి పండితు డుద్భవించి వీరశైవము నవలంబించి తన రచనలద్వారా ఆ మతమున కమిత ప్రచారము కలిగించెను. ప్రస్తుత మాంధ్రదేశమున వీరశైవమునకు గల వ్యాప్తి కతడే ప్రధానహేతువని చెప్పవచ్చును."

"క్రీ. శ. 13 వ శతాబ్ది యారంభము నుండి యాంధ్రదేశమున గూడ వీరశైవము విజృంభింప దొడగెను. వీరశైవు లావేశపరులై యన్యమతస్థుల, ముఖ్యముగా వైష్ణవుల - దర్శన స్పర్శన భాషణములను వర్జించుచు వారిని

ద్వేషింప నారంభించిరి'' శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే'' అను భావమున కర్థమే లేకపోయెను. ఈ శైవవైష్ణవములకు సామరస్యము కలిగించు నుద్దేశముతో తిక్కన తాను రచించుచున్న భారత భాగములను హరిహర నాథ దేవుని కంకితము గావించెను హరిహరనాథుడు హరియు హరుడును నేకరూపము నొందిన పరమదైవము. ఈ కార్యమువలన నా మహాకవి శివకేశవులకు నామములందే కాని తత్త్వమునందు భేదము లేదని లోకమునకు జాటదలంచి యందు కృతార్థుడయ్యెను."

"వ్యాసప్రణీతమైన సంస్కృత మహాభారతమున వివిధ సన్నివేశములందు శివుని మహత్త్వమును, అతనికిగల వివిధ నామములును, తన్నిర్వచనములును, శివకేశవాద్వైతమును, లింగార్చారూప పూజలయందలి భేదమును, ఆత్మోపహార విధానమును, శివుని భక్తావనప్రవణత్వమును దెలుపబడినవి. వ్యాసునికాలము నాటికింకను శైవవైష్ణవ మతభేదము లంకురించినట్లు కనబడదు. తరువాత తిక్కన సోమయాజి అవలంబించిన హరిహరాద్వైతమునకు బీజములు వ్యాసభారతమునందే కనిపించును. ఉదాహరణమునకు—శివుడు ఖండపరశుడైన సందర్భమున రుద్రనారాయణమూర్తి ద్వయము రణము చేయ నారంభింప లోకములన్నియు గలతజెందెను. బ్రహ్మాది దేవతలును మునులును దన్ను గొల్వ నచ్చటి కరుదెంచి రుద్రునకు బ్రణమిల్లి "నిగమవేద్యము, అద్వంద్వము, నిర్గుణము, అమూర్తము నగు తత్త్వము మూర్తిభేదకలనమున లోకమున ద్విధాకారి యయ్యెను గాని, హరియన, సీవన భేదమున్నదే?! నరనారాయణులు జగదాది పురుషులు. మన మిర్వురమును దన్మయత్వస్ఫురితులమే. అనుగ్రహించి యీతని దెలుపు" మని ప్రార్థించెను. శివుడు కోపము విడిచి నారాయణుని దెలిసెను. అప్పుడు నారాయణుడు శివునితో, "నిన్నెవ్వ డెఱిగెనో యాతడు నన్నెఱిగినవాడే. అట్లే నిన్ను సేవించుట నన్ను సేవించుటయే. మనకెట్టి భేదమును లేదు. నేటినుండి నాకు నీ శ్రీవత్సము శూలాంకితమై వెలయుగాక! నీవును మత్పాణ్యంకోద్భావనచే శ్రీకంఠు డనగబరగు" మని పలికెను. ఇది హరిహరాభేదమును దెల్పుఘట్టము."[15] (శాంతిపర్వము,

15. ఆంధ్ర మహాభారతము - సంశోధిత ముద్రణము, (సంపుటం - 8). (అశ్వమేధ - స్వర్గారోహణపర్వములు) - ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 1973.

443. ప. - 452 ప.) దివాకర్లవారి పరిశోధన వ్యాసం ఆలోచనాత్మకంగా వుంది. ఈ దృష్టితో తిక్కనకు పూర్వమత పరిస్థితులు, వ్యాసభారతంలో హరిహరాద్వైత భావబీజములను సమగ్రముగా పరిశీలింపవలసియున్నదని తెలియుచున్నది.

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు కవులు,విమర్శకులు. "తిక్కన భారత దర్శనము" అనే గ్రంథాన్ని వీరు 1969 లో ప్రకటించారు. ఈ 'దర్శనము'లో హరిహరనాథ తత్త్వ దర్శనాన్ని యిలా ప్రదర్శించియున్నారు.

"తిక్కన హరిహరనాథుని 'పరతత్త్వము'గనే పేర్కొనెను. ఇప్పుడచ్చటను నెల్లూరులో హరిహరనాథ దేవాలయము గాని శిథిలావశేషములు గాని లేవు. కొందరు ఆ యాలయము పెన్నలో గలిసిపోయినదని సమాధానము చెప్పుచున్నారు. కాని, తిక్కన రచించిన ఆశ్వాసాద్యంత పద్యములలో నెచ్చటను హరిహరనాథుని పెన్నాతీరవాసునిగ చెప్పలేదు. "అంతస్సన్నిధి కలిగించుకొని ..." అని వ్రాసెను. నాచనసోముడు, వేంకటనాథుడు నెల్లూరు వారు కారు. నెల్లూరులోని హరిహర దేవాలయమును వారు ప్రస్తావింపలేదు."

నేటి రంగనాథ దేవాలయ స్థానమున పూర్వము హరిహరనాథాలయ ముండెడిదని మరికొందరి యూహ. తిక్కనకు పూర్వము నుండియు నెల్లూరిలో రంగనాథాలయమున్నది. (Nellore District Inscriptions)

హరిహరనాథపురము లేక హరిహర్ లేక కుడలూర్ అను పట్టణము తుంగభద్రా హరిదానదీ సంగమస్థానమున కలదు, ఈ పట్టణము పద్మపురాణ ప్రసిద్ధమైన తీర్థయాత్రాస్థలము.

"కన్నడ దేశమందలి హరిహరక్షేత్రము నుద్ధరించి గోపుర మంటపాదులను గట్టించినవాడు - తెలుగు సేనానియైన పోలాళ్వ దండనాథుడు. అతడు క్రీ. శ. 1224 సంవత్సరము గోపురము కట్టించినట్లతని శాసనమువలన దెలియుచున్నది. ఈతడు 'హరిహర చరిత్రము' అను గ్రంథము రచించెననియు, సంగీత సాహిత్య ప్రియుడనియు దెలియుచున్నది. ఇతడు హొయసల వంశస్థుడైన నరసింహరాజు సేనాపతి. ఇతడు నారాయణపురవాసియైన ఆంధ్రుడు.

ఈ దేవాలయ పునర్నిర్మాణము తిక్కన నిర్వచనోత్తర రామాయణమునకు ఇంచుమించుగ నలభై సంవత్సరములకు పూర్వము జరిగినది."

ఆంధ్రదేశమునందలి అనంతపురమండలమునందలి కల్యాణదుర్గ సమీపమందలి తూముకుంట్ల గ్రామమునందును హరిహరాలయ మొకటికలదు. అది ఈ హరిహర్‌కు అడ్డదారిని సుమారు 50 మైళ్ళలోపుగ నున్నది. తూముకుంట్లలోని హరిహరనాథ విగ్రహమునకు హరిహర్‌లోని విగ్రహమునకు సామ్యము గమనింపదగినది. హరిహర్‌లోని హరిహరనాథుడే తూముకుంట్లలోని హరిహర విగ్రహమునకు ప్రాతిపదిక కావచ్చును. హరిహరనాథుని తత్త్వము తిక్కనకు పూర్వమే కన్నడదేశమున నున్నట్లు దీనివలన ఋజువగుచున్నది."

"తిక్కనకు ప్రాచీనుడైన పాల్కురికి సోమన సల్పిన విమర్శ తిక్కనకు పూర్వమే కన్నడదేశమున నున్న హరిహరనాథోపాసనకే అన్వయించును."

"హరిహర క్షేత్రమను పేరుగల సోనేపూరు పట్టణమింకొకటి గంగా గండకీ నదీ సంగమమున గలదు. ఇది వరాహపురాణ ప్రసిద్ధమగు క్షేత్రము. గాంధీమహాత్ముడు సనాతనమైన అహింసా సిద్ధాంతమునకు తిరిగి ప్రాణప్రతిష్ఠ సల్పినట్లు తిక్కనిగూడ పురాణ ప్రసిద్ధమైన హరిహరనాథోపాసనకు భారత రచనద్వారా పునరుజ్జీవము గల్పించినట్లెంచ వచ్చును."

"ఇక ఆశ్వాసాద్యంత పద్యములలో తిక్కన ప్రతిపాదించిన హరిహర తత్త్వము మతపరిధిదాటి వేదాంత వీథుల విహరించునట్టిది."[16]

హరిహరనాథ అర్చావిగ్రహాన్ని గూర్చి ఆసక్తికరమైన విశేషాలను వెల్లడించిన వారిలో నండూరి వారొకరు. వారు ప్రతిపాదించిన ముఖ్యాంశాలివి 1) తిక్కనకు పూర్వంనుండి నెల్లూరులో రంగనాథాలయ మున్నది 2) కన్నడదేశంలో హరిహర క్షేత్రమున్నది. 3) హరిహర దేవాలయోద్ధారకుడైన పోలాళ్వ దండనాథుడు 'హరిహరచరిత్ర' మనే గ్రంథం వ్రాశాడు. 4) ఆంధ్రదేశంలోని అనంతపురం జిల్లా కల్యాణదుర్గం తాలూకా తూముకుంట్ల గ్రామంలోని హరిహరాలయములోని దేవుడు హరిహర్‌లోని హరిహరనాథునికి

16. తిక్కన భారత దర్శనము — డా॥ నండూరి రామకృష్ణమాచార్య, ప్రగతి గీతాప్రెస్, హైదరాబాద్, 1966.

ప్రతిరూపము (Replica) 5) పాల్కురికి సోమన తిక్కనకు పూర్వుడు. 6) సోనేపూరు పట్టణములో హరిహరక్షేత్రము గలదు.

1957 లో మద్రాసు విశ్వవిద్యాలయం వారిచే ప్రచురింపబడిన 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము' (సంపుటం-1) అనే ఉద్గ్రంథ రచయిత శిష్టా రామకృష్ణ శాస్త్రిగారు. అందులో హరిహరనాథుని గూర్చి ఒకటే ఒక్క వాక్యముండుట ఆశ్చర్యకరమైనది. ఆ వాక్యమిది - "తిక్కన తన భారతమును నెల్లూరు దేవాలయమునందలి హరిహరనాథ దేవున కంకితమిచ్చెను" (పుట-365). ఈ వాక్యాన్నిబట్టి శిష్టావారి అభిప్రాయంలో తిక్కన కాలంలో నెల్లూరులో హరిహర నాథాలయ మున్నట్లు తెలుస్తోంది. కాని దీనికి చారిత్రక, శాసనాధారాలు యింతవరకు దొరకనే లేదు.

తిక్కన సోమయాజి హరిహరనాథుని సంబోధిస్తూ రచించిన 203 పద్యాలు మహాభారతం ఆశ్వాసాద్యంతాలలో వున్నాయి. ఈ పద్యాలలో గూఢమైన తత్త్వార్థం యిమిడివుందని, ఆ పద్యాలు వ్యాసఘట్టాలవలె తిక్కన గ్రంథ గ్రంథులుగా రచించాడని పలువురు పండితులు చెప్పడమేగాని నిన్న మొన్నటివరకు వ్యాఖ్యానించిన వారెవరూ లేరు. 1972 లో ఆంధ్ర విశ్వ విద్యాలయం స్నాతకోత్తర విద్యాకేంద్రంలో గౌరవాచార్యులుగా నుండిన ఓరుగంటి నీలకంఠశాస్త్రిగారు. ఈ మహాత్కార్యాన్ని చేపట్టి కృతకృత్యు లయ్యారు. ఈ గ్రంథం "తిక్కయజ్వ హరిహరనాథ తత్త్వము"[17] అనే పేరుతో 1977 లో వెలువడింది.

న్యాయం, పూర్వమీమాంస, ప్రస్థానత్రయం సంప్రదాయ బద్ధంగా అధ్యయనం చేసిన శ్రీ శాస్త్రిగారు, జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీ మహా స్వామి పాదులచే మంత్రదీక్ష గైకొన్నవారు. 418 పుటల్లో వీరు తిక్కన హరిహరనాథతత్త్వాన్ని వ్యాఖ్యానించారు. 14 పుటలలో వ్రాసిన 'ఆముఖం'లో వీరు 1973 లో ఖండవల్లి లక్ష్మీరంజనంగారు సంశోధిత మహా భారత ముద్రణకు వ్రాసిన 'హరిహరనాథ తత్త్వము' అనే వ్యాసంలోని

17. తిక్కయజ్వ హరిహరనాథ తత్త్వము — ఓరుగంటి నీలకంఠశాస్త్రి, కౌండిన్యాశ్రమము, కృష్ణనగరము, గుంటూరు—(1977).

అనేక విషయాలతో సంవదిస్తున్నారు. వీరు విలక్షణంగా ప్రతిపాదించిన హరిహరనాథ తత్త్వార్థం "కిమస్మిమాలాం ..." అనే శ్లోకానికి వ్యాఖ్యలో వున్నది. ఆ వాక్యాలను మాత్రమే నేనిక్కడ ప్రస్తావిస్తున్నాను.

"లోకమున బృథఙ్మూర్తులుగా నెన్నబడు హరియును, హరుడును దిక్కయజ్వకు నభిన్నులై యేకరూపమునంది హరిహర రూపమును దాల్చిరి. ఈ హరిహరమూర్తి కేవలము తిక్కయజ్వ మనఃప్రభవము గాక సనాతనమగు శాస్త్రసిద్ధమే. శాస్త్రమునందు ఒకే దేవతను ప్రయోజన పార్థక్యముచే భిన్న రూపకల్పనముతో, భిన్న భిన్న నామములతో భిన్న భిన్నముగ నుపాసించుటగలదు. కావుననే శైవవైష్ణవాద్యాగమములందు శైవగణ దేవతలు, వైష్ణవగణ దేవతలు మున్నగువారు పృథక్ పృథఙ్మంత్రోపాస్యు లగుచున్నారు. అట్లే పృథఙ్మూర్తులుగా నుపాసింపబడు దేవతలే తుల్యప్రయోజలమునకై యభేద మూర్తిగ నుపాసింపబడుచున్నారు. కావున హిరణ్యగర్భ హరిహరులు పృథఙ్మూర్తులుగాను, ఏకరూపులుగాను అర్చింపబడుట శాస్త్రసిద్ధమే. ఇట్టిమూర్తియే దత్తాత్రేయరూపము ఇది హరిహర హిరణ్యగర్భాత్మకము. శ్రుతి స్మృత్యాగమ గ్రంథములందు చతుర్ముఖ బ్రహ్మోపాసనము కంటె హరిహరుల యుపాసనమే ప్రచురమైనట్లగపడును. ఈ హరిహరులకు వ్యష్ట్యుపాసనమేగాక, సమష్ట్యుపాసనము గూడ హరిహరాత్మకముగ సనాతనకాలము నుండియు సుప్రసిద్ధముగ దెలియబడుచున్నది. పాణిన్యాచార్యునకు బూర్వము నుండియు ప్రసిద్ధ 'వృషాకపి' శబ్దము కేవల హరిహరులయందేగాక హరిహరాత్మక సమిష్టి దేవతయందును వ్యవహారమును గనునని చెప్పుటలో విప్రతిపత్తి యెంతమాత్రము గానబడదు. ఈ శబ్దము శ్రీ గౌరీ రూపార్థమున గొలది మార్పులతో "వృషాకపాయీ" యని వ్యవహారమున నున్నట్లు 'వృషాకపి అగ్నికుసిత కుసిదానాముదాత్తః' (4-1-37) అను పాణిని యనుశాసనమువలన దెలియుచున్నది."

"మహారాష్ట్ర దేశమునందలి త్ర్యంబక క్షేత్ర సమీపమునను మఱికొన్ని తావులందును ఈ హరిహరమూర్తి సుప్రసిద్ధ పవిత్రక్షేత్రమూర్తిగా నున్నట్లు చెప్పుదురు. కావున నీ హరిహరమూర్తి సుప్రసిద్ధ ప్రాచీన దేవతా మూర్తియే గాని శైవవైష్ణవ సామరస్యమునకు దిక్కయజ్వచే క్రొత్తగా గల్పింపబడినదని

చెప్పుటకు నవకాశము లేదు. పార్థక్యముతోఁ బ్రసిద్ధములగు దేవతామూర్తులకు ఏకధా భావనము సామాన్యజనులకు నలవికాకపోవుటచే నిట్టి యభిన్న రూపోపాసకులు గాని, యవ్వారలకై నిర్మింపబడు సమిష్టి దేవతా మూర్తులు గాని, చాలనరుదుగా దేశమునం దగపడుచున్నవి. కావున నీ హరిహరమూర్తి తిక్కయజ్వోపజ్ఞమనుట యుచితముగాదు"[18]

నీలకంఠశాస్త్రిగారు హరిహరనాథుణ్ణిగూర్చి చెబుతూ వైదికవాఙ్మయంలో సుప్రసిద్ధమైన 'వృషాకపి'ని ప్రస్తావించుట సందర్భోచితంగా వున్నది. వ్యాసకృత సంస్కృత మహాభారతంలో శాంతిపర్వములో 47 వ అధ్యాయంలో 121 శ్లోకాలలో శరతల్పగతుడైన భీష్మాచార్యుడు శ్రీకృష్ణభగవానుని స్తుతిస్తూ చెప్పిన స్తవమునకే భీష్మస్తవరాజమని, వృషాకపి స్తవమని పేరు.[19] పై స్తోత్రరాజాన్ని తిక్కన సోమయాజి, ఆంధ్ర మహాభారతంలో శాంతిపర్వం రెండవ ఆశ్వాసంలో 20 వ పద్యం మొదలుకొని 59 వ పద్యం వరకు అనగా దాదాపు 40 గద్య పద్యాలలో అనువదించినాడు.

'భీష్మస్తవరాజం' లో వ్యాసమహర్షి 'వృషాకపి' శబ్దాన్ని ప్రయోగించలేదు. కాని వైదికవాఙ్మయరహస్యవేత్తయైన తిక్కన సోమయాజి ఈ స్తవానికి 'ఫలశ్రుతి' చెబుతూ వైశంపాయనుని ముఖతః యిట్లనిపించినాడు

కం॥ స్తవరాజం బనగ ముని
స్తవనీయంబైన యీ వృషాకపి భవ్య
స్తవనామృతార్ణవము సం
స్తవనంబున నిచ్చు సుగతి జగతీనాథా ! (శాంతి. 2-58)

"వృషాకపి భవ్య స్తవన అమృతార్ణవము" అని సోమయాజి 'భీష్మస్తవరాజము' నకు పెట్టిన పేరు. ఈ 'వృషాకపి' శబ్దాన్ని తిక్కన ఎక్కడినుండి గ్రహించాడు? ఇది శ్రీవిష్ణుసహస్ర నామములలో ప్రసిద్ధమైనది.

---

18. చూ॥ పైగ్రంథము. పుటలు 17—18.

19. భీష్మస్తవరాజము—(టీకాతాత్పర్య సహితము)—చదలువాడ జయరామశాస్త్రి సరస్వతీ గ్రంథమాల, ఉస్మాన్‌సాహెబుపేట, నెల్లూరు. (1957).

అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధ సర్వాది రచ్యుతః ।
వృషాకపి రమేయాత్మా సర్వయోగ వినిస్సృతః ॥
వసుర్వసుమనాః సత్యః సమాత్మా సమ్మితః సమః ।
అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః ॥ (11, 12 శ్లో.)

ఈ 'వృషాకపి'[20] నామం వెంటనే 'పుండరీకాక్ష' నామం రావడం గమనిస్తే బ్రహ్మసూత్రాల్లో 'కప్యాసం పుండరీకాక్షమ్' అను మాటతో దీనికి గల సమన్వయం స్ఫురిస్తోంది. దీనికి అద్వైత, విశిష్టాద్వైత భాష్యాల్లో వేర్వేరు అర్థాలు చెప్పబడినాయి.[21]

ఆధునికకవుల్లో కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు శ్రీమద్రామాయణ కల్పవృక్షంలోను, మధ్యాక్కఱలలోను పలుమార్లు 'వృషాకపి' శబ్దంతో పాటు 'నీలలోహిత' శబ్దాన్నికూడా ప్రయోగించినారు. పరిశీలింపగా 'వృషాకపి' శబ్దం వంటిదే 'నీలలోహిత' శబ్దంకూడ. వైదిక వాఙ్మయం

---

20. వైదిక వాఙ్మయంలో 'వృషాకపి'ని గూర్చి యింకను తెలుసుకొనగోరువారు ఈ క్రింది పరిశోధన వ్యాసాలు పరిశీలించ ప్రార్థన.

a) The story of Vṛṣākapi and its Transformations—K. Ramavarma Raja, Quarterly Journal of the Mythic Society, Vol. XXI, No. 1, July 1930, pp. 10-17.

b) Further Notes on Vṛṣākapi—K. Ramavarma Raja QJMS, Vol. XXI No. 2, Oct 1930, pp. 186-87.

c) Vāyu and Vṛṣākapi —R. Shama sastry—New Indian Antiquary, Vol. V. Dec. 1942 pp. 213—16.

d) Vṛṣākapi — S. Srikantha Sastri, Bharatiya Vidya, Bombay, Vol. X 1949 pp. 192—207.

21. 'అంతస్తద్ధర్మోపదేశాత్' అన్న బ్రహ్మసూత్ర వ్యాఖ్యలో శ్రీ శంకరులు 'యథా కప్యాసమివ పుండరీకమేవ మక్షిణీ' అన్న ఛాందోగ్య మంత్ర భాగమునకు "కపేర్మర్కటస్య ఆసః పుచ్ఛ భాగోత్యంత తేజస్వీ తత్తుల్యం పుండరీకం యథా దీప్తిమదేవం తస్య పురుషస్యాక్షిణీ సద్యోవికసిత రక్తాంభోజనయన ఇత్యర్థః' అని అద్వైతపరమైన వ్యాఖ్యానం కాగా, శ్రీ రామానుజులు "కపినా ఆసం కప్యాసం", కపా ఆసం నాళస్థం పుండరీకం, కేప్యాసం కప్యాసం" అని తమ శ్రీ భాష్యమున వ్యాఖ్యానించినారు.

లోని అత్యంత ప్రసిద్ధమైన పదాల్లో ఇదొకటి. శివకేశవు లిద్దరు నీలలోహిత నామకులే.[22] కాబట్టి 'వృషాకపి' హరిహరాత్మక సమష్టి దేవతకు పర్యాయ పదమని నిశ్చయింపవచ్చును. తిక్కన హరిహరనాథ స్తవాన్ని వృషాకపి స్తవమని చెప్పవచ్చు.

హరిహరనాథ తత్త్వాన్ని గూర్చి రెండవతరం వారి భావ ప్రపంచాన్ని పరామర్శించడానికి ముందు మొదటితరం వారిని గూర్చి రెండుమాటలు. మొదటితరం వారిలో ఒక్క ఒంగోలు వేంకటరంగయ్యగారిని మినహాయించి తక్కిన కవిజీవిత చరిత్రకారు లెవరూ హరిహరనాథతత్త్వాన్ని గూర్చి పట్టించుకోలేదనే చెప్పాలి. కవి, కాలము, దేశము, హరిహరనాథ దేవాలయం నెల్లూరులో వుండినదా ? లేదా ? ఆనాటి మతకలహాలు — ఈ పరిధిలోనే వారి ఆలోచనలు ప్రసరించాయి, కాని ఈ బాహ్యసమస్యల్ని దాటి తత్త్వనిర్ణయానికి వారు పూనుకోలేదు. ఒంగోలు వేంకటరంగయ్యగారు కూడ హరిహరపుత్రుని గూర్చి చర్చించారేగాని తత్త్వనిర్ణయానికి ప్రయత్నించలేదు.

ఇక రెండవతరం వారిలో హరిహరనాథ తత్త్వాన్ని సూత్రతః నిర్వచించడానికి ప్రయత్నం జరిగింది. పింగళి, ఖండవల్లి, ఓరుగంటివారు ఇట్టి ప్రయత్నం చేసినవారు. వీరిలో ఖండవల్లి కొంత విస్తృత పరిధిలో తమ భావనను ప్రపంచించినారు. మొత్తంమీద పరిశీలింపగా హరిహరనాథ తత్త్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి నాలైదు దృక్పథాల ఏకత్రీకరణ ఆవశ్యకమని తెలుస్తోంది.

---

22 వైదిక వాఙ్మయాన్నంతటినీ గాలింపగా 'నీలలోహిత' శబ్దం 25 సార్లు ప్రయోగింపబడినట్లు తేలింది. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలమ్ (7-36) లోనూ కుమార సంభవమ్ (2-57) లోను ఈ శబ్దం ప్రయోగించాడు. "విద్యారణ్య భాష్య సహితమైన రుద్రాభిషేక మాహాత్మ్యంలో 'ద్రాపే అంధ సస్పతే దరిద్రం నీలలోహిత' (అనువాకం 10-1) అన్న ఋక్కును శివకేశవ పరంగా విద్యారణ్యులు వ్యాఖ్యానించినారు. కంఠమునందు నీలమును, వామభాగమున లోహితమును అగు శరీరము గలవాడగుటచే శివుడు నీలలోహితుడు. విష్ణువు నీలుడు=నల్లనివాడును, సూర్య రూపమున నుండుటచే లోహితుడును అయ్యెను. రాక్షస సంహారముచే వాటిల్లిన కాలుష్యమంతయును దొలగించుటచే కూడ నీలలోహిత నామము శివకేశవులకు సార్థకమే అగును." విశేషాలకు చూ॥ తెలికిచెర్ల రాజేశ్వరశర్మగారి అనువాదం.(1982), 5

1) చారిత్రక దృక్పథం
2) మత దృష్టి
3) వేదాంత సమన్వయ దృష్టి
4) శిల్పాగమ శాస్త్ర దృష్టి
5) సంస్కృతాంధ్ర సాహిత్య విమర్శావగాహన

పై నాల్గైదు దృక్పథాలలో చారిత్రక, మత పరిస్థితుల్ని మాత్రమే రెండవతరం విమర్శకులు కొంతవరకు పరిశోధించి కృతకృతులయ్యారు. వీరి చారిత్రక దృష్టిలో తిక్కన సమకాలీన రాజకీయ, మత పరిస్థితులు మాత్రమే పరిశీలింపబడినాయి. చారిత్రక పరిశోధనలో, నేను మొదటివ్యాసం ఉపోద్ఘాతంలో చెప్పినట్లు, యావద్భారత దేశంలో హరిహరనాథ సంప్రదాయాన్ని, బృహద్భారతంలో హరిహరనాథార్చనను దృష్టిలో పెట్టుకొని అందులో ఆంధ్రదేశంలో తిక్కనకున్న స్థానాన్ని నిర్ణయించాలి అట్లే తిక్కనకు పూర్వం మత పరిస్థితుల్ని ఇరుగుపొరుగు రాజ్యాల వరకు పరిమితం చేసుకొనడం న్యాయంగా కనబడుతున్నా విశాల భారతదేశాన్ని పరిగణన లోనికి తీసుకొనడంవల్ల తిక్కన మతవైలక్షణ్యం మరింత అవగాహనకు వస్తుందని నాఅభిప్రాయం. ఇక, వేదాంత సమన్వయదృష్టిలో వైదిక వాఙ్మయంలోని వేదాంత గ్రంథాలతో గాఢమైన పరిచయమే కాకుండా వాటిని తిక్కన భావనకు సమన్వయం చేయడంలో ఔచిత్యం తెలిసివుండడం. వైదికమార్గనిష్ఠమైన అనుష్ఠానవేదాంతి తిక్కన సోమయాజి. ఆయనకు వైదికవాఙ్మయమంతా కరతలామలకం – అనడానికి హరిహరాద్వైతభావనయే ప్రత్యక్ష నిదర్శనం. ఓరుగంటివారు ఈ దృష్టితో వ్యాఖ్యానించడానికిచాలవరకు ప్రయత్నించినారనే చెప్పాలి. కాని ఏపద్యానికా పద్యం వ్యాఖ్యానించడంవల్ల అది "తీర్థానికితీర్థం, ప్రసాదానికి ప్రసాదంగా మిగిలిపోయింది. తన సమ్యక్ పరిశోధనకు సారభూతంగా ఆయన తిక్కన దృష్టిలో హరిహరనాథుని గూర్చి విపులమైన పీఠిక వ్రాసివుండవలసింది; కాని వ్రాయలేదు. వ్రాసివుంటే భారతీయ వేదాంత భావధారలో హరిహరనాథ తత్త్వానికిచెందిన వివిధవైరుధ్యాలకు సమన్వయం కుదిరి ఒక విస్పష్టమైన తత్త్వనిష్కర్ష ఏర్పడివుండేది. అట్టి నిష్కర్ష ఏమైనా మూడవతరం విమర్శకులు చేశారా అనేది తర్వాత మరో విషయం.

ఇక చిట్ట చివరిగా శిల్పాగమశాస్త్రదృష్టి నిన్న మొన్నటి వరకు మన వారికి లేదనే చెప్పాలి. ఈ అవగాహనకు ఆధునిక శిల్పశాస్త్ర వేత్తల గ్రంథాలను పఠించడం ప్రథమకర్తవ్యం. మొదటి తరంలో ఒంగోలు వేంకటరంగయ్య గారికీ దృష్టి కొంత వున్నట్లు తెలుస్తోంది. కాని అప్పటికే హరిహరనాథుని గూర్చి శిల్పశాస్త్రాలలోని విషయాలనేకం వెలుగులోనికి వచ్చి వున్నాయి. మన తెలుగు సాహిత్య విమర్శకులెందుకో తత్త్వ శిల్పాలను గూర్చిన గ్రంథాలను పట్టించుకోరు, సరికదా – అలాంటి విషయాలను తమ రచనల్లో ఎప్పుడూ పరిహరిస్తూ వుంటారు. మూడవతరం విమర్శకుల్లో ఈ దృష్టికూడా వున్నట్లు మనం గమనించబోతున్నాము.

ఇక చివరగా సంస్కృతాంధ్ర సాహిత్య విమర్శావగాహన అంటే ఆయా సాహిత్యాలు, విమర్శలతో పరిచయమే కాకుండా సారస్వత హృదయంతో కవి హృదయాన్ని గ్రహించి సమన్వయం చెప్పడం. ఈ సహృదయ హృదయ విమర్శకూడా ఈ శతాబ్దాంతంలో మనకు దృగ్గోచర మవుతూవుంది. ఇన్ని దృక్పథాలు ఏకీభవించినపుడే హరిహరనాథతత్త్వాన్ని గూర్చిన సమ్యగవగాహన మన కేర్పడుతుంది.

తిక్కన తెలుగుసీమకు మాత్రమే పరిమితమైన వ్యక్తి కాడు. ఆయన హరిహరనాథతత్త్వం కేవలం ఒక ప్రాంతీయోద్యమం కాదు. అది విశాల భారతీయ వేదాంత భావనతో ముడిపడినట్టిది. ఈ స్థాయిలో తిక్కన భావ ప్రపంచ వైలక్షణ్యాన్నీ, దాని విశిష్ట స్థానాన్నీ నిర్ణయించాలనేదే ప్రస్తుత వ్యాసం యొక్క ప్రధానోద్దేశం. భారతీయ సాహిత్య నిర్మాతల్లో తిక్కనవంటి విలక్షణవ్యక్తి 'న భూతో న భవిష్యతి'. తిక్కన సోమయాజి 'కవి-తాత్త్వికుడు' (The poet-philosopher) అని దీని సారాంశం. ఆంధ్రమహాభారతం ఆశ్వాసాద్యంతాలలో తిక్కన తన దార్శనికశక్తిని నిక్షిప్తపరచినాడు. అది విమర్శలో ఆవిష్కరింపబడినప్పుడే సహృదయుల దృక్పథంలో హరిహర నాథుడు సర్వభువనార్చితుడైనట్లు.

డా॥ ఎలవర్తి చంద్రమౌళి

అముద్రిత 'హాస్య శుభలేఖ'-పరిశీలన

తాళపత్ర ప్రతి సంఖ్య	: D 2794
రచన పేరు	: హాస్య శుభలేఖ
రచయిత పేరు	: (?)
లిపి	: తెలుగు
పత్రాల సంఖ్య	: 2
పత్రాల కొలతలు	: 32 x 3 సెం. మీ.
పంక్తుల సంఖ్య	: 5
పంక్తిలోని సరాసరి అక్షర సంఖ్య	: 54
స్థితి	: బాగున్నది. సమగ్రము. వ్రాత చక్కనిది.
ప్రచురితమా ?	: కాదు.

పై వివరణకలిగిన తాళపత్ర ప్రతి ఒక హాస్య రచన. ప్రతిమీద 'హాస్య శుభలేఖ' అని, లోపల 'హాస్యపత్రం' అని పేర్కొబడింది. ఇది ఒక లేఖ. పై జారుల మల్లంబొట్లు గారిని పాపోజు(సు)ల కొండంబొట్లు పెళ్లికి ఆహ్వానిస్తూ వ్రాసిన ఉత్తరం ఇది. ఇవి కల్పితనామాలు తప్ప అసలునామాలుగా కనిపించవు. పై జారులు, పాపోజులు, అన్నమాటలకు 'ముచ్చెలు' అని అర్థం. అందువల్ల ఈ రెండింటినీ హాస్యంకోసం కల్పించినట్లే అనిపిస్తుంది.

లేఖలో సగభాగం మల్లంబొట్లుగారి విశేషణాలతోనే నిండిఉంది. మొత్తం 18 విశేషణాలున్నాయి. అవికూడా హాస్యపూరితంగాను, వ్యంగ్యం

గాను ఉన్నాయి. అందులో మొదటిది మల్లంబొట్లుగారిని షట్కర్మ నిరతుడని చెప్పేది. షట్కర్మల్లో యజన, యాజన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహాలను స్పష్టంగా చెప్పాడు. నాల్గవదైన 'అధ్యయనా'న్ని పేర్కొలేదు. రెండో విశేషణం దానగుణాన్ని చాటేది. అందులో గోదాన, భూదానాలతో పాటు మహిష, మార్జాల, తిలదానాలను చేర్చాడు. అతడు పిండివంటల పాలిటి పిడుగట శల్యపాయస భోజన ప్రముఖుడట ఎనుకల పాయసం అనడం హేళనకోసం అన్నది స్పష్టం. మల్లంబొట్లుగారిది శిఖపట్ల గోత్రమట. ఆగడాల సాంప్రదాయమట. అతడు అనామధేయ కులాగ్రణ్యుడట. ఆకతాయి శిరోమణి యట. విశేషణాలన్నీ ఇదేవరుసలో హాస్య పూరితంగా సాగుతవి.

లేఖలో పేర్కొన్న సంవత్సరం పేరు లొట్టిపిట్ట సంవత్సరం. పూర్వం పాండిత్యాన్ని ప్రదర్శించడంకోసం, పరీక్షించటంకోసం మరుగుపదాలతో లేఖలు వ్రాసేపద్ధతి ఉంది. ఉదాహరణకు బ్రహ్మనామ సంవత్సరం అని ప్రయోగించడాన్ని గ్రహిస్తే, బ్రహ్మనామ సంవత్సరం అని పేరుగా లేదు. బ్రహ్మ అంటే ధాత. కాబట్టి ధాతనామ సంవత్సరం స్ఫురించాలి, ఇదేవిధంగా పెద్దమాసం అన్నప్రయోగం జ్యేష్ఠ మాసాన్ని స్ఫురణకు తెస్తుంది. లొట్టిపిట్ట నామ సంవత్సరం ఈ కోవకు చెందిందికాదు. హాస్యంకోసం కల్పించిందే.

'చిన్నదాన్కి చిన్నవాన్కి వివాహం తగులబెట్టుతాము''— అని శుభ కార్యాన్ని అశుభకర పదజాలంతో వ్యక్తం చేశాడు. ఇందులో 'కొనగాల్చి' 'అవాచకులచేత ముట్టిస్తిమి'—వంటి మాటలు కూడా ఉత్తరక్రియలకు సంబంధించిన పత్రికనే స్ఫురింపజేస్తాయి. కొండంబొట్లు చిన్నదాని తరపున ఆహ్వానిస్తున్నాడో, చిన్నవాని తరపున ఆహ్వానిస్తున్నాడో తెలియదు.

ముహూర్త సమయం కూడా హాస్యధోరణిలోనే ఉంది. "మాఘ శుద్ధ అమావాస్య ఆదివారం రాత్రి పదహారు ఘడియలవేళ కుంభలగ్నమందు శుక్కల)చుక్కల) నక్షత్రమందు మధ్యాహ్నంగా''— అన్నాడు. ఇందులో రాత్రి అని, మళ్లీ మధ్యాహ్నం అనడం హాస్యం కోసమే.

పెళ్లికి ఎలారావాలో వివరించాడు. కొంత సరంజామాతో దారా పుత్రాదులతో పళ్ళు వెళ్లగిల బెట్టుకుని, గుడ్లు వెల్లగిల బెట్టుకొని,

అందర్నీ కట్టగట్టుకొని రమ్మంటాడు. ఆసరంజామా అంతా పెండ్లికి సంబంధంలేనిది కాగా, అంత్యక్రియలకి సంబంధించినది పేర్కొన్నాడు. కొత్తకుండలు రెండు కావుళ్ళు, కావడు దర్భ, రెండుకుంచాల తిలాక్షతలు. నాలుగు బండ్లు వంటచెరకు, నలుగురు చిరకేశ ఖండనులయిన పేరంటాళ్ళు, బత్తెంకోసం షోడశ శష్పాలు, వెంటబెట్టుకుని రమ్మంటాడు. స్థాలీపాకంకోసం ఏడుగురికి తక్కువ కాకుండా, తొమ్మిది మందికి ఎక్కువ కాకుండా బ్రాహ్మణులను తీసుకురమ్మన్నాడు.

ఈ రచన ఏ కాలానికి చెందిందో చెప్పడానికి ఏ ఆధారమూ లేదు. నూరు, నూటయాభై సంవత్సరాలకు మునుపటిదిగా ఊహించవచ్చు. రచయిత పేరుకూడా ఇందులో లేదు. లేఖలోని విషయాన్నిబట్టి పాపోజుల కొండంభొట్లు వ్రాసినట్లు మాత్రం అనుకోగలం.

ఈ విధంగా హాస్య పూరితంగా వ్రాసే ఉత్తరాలు నేటికీ లేకపోలేదు. ప్రసిద్ధంగా గ్రామఫోను రికార్డుల్లో ఇలాంటి పాట ఒకటుంది. అది హాస్యం బాగా కలగలసింది. పిల్లల పత్రికగా ప్రసిద్ధిగాంచిన 'బుజ్జాయి'లో ఇలాంటి ఉత్తరాలు లలితహాస్యంతో ప్రచురింపబడినాయి. కానీ ప్రస్తుత లేఖలో హాస్యం, వ్యంగ్యంతోబాటు, శుభకార్యాన్ని వివరిస్తూ అశుభకరమైన విషయాన్ని ధ్వనింప చేశాడు రచయిత. ఇది చాలా మంది నొచ్చుకొనే విషయం.

ఇలాంటి లఘు హాస్యరచనల ఉద్దేశం తాత్కాలికంగా హాస్యం పుట్టించడం, వేళాకోళం చేయడం తప్ప వేరొకటికాదు. ఉద్దేశం ఏదైనా ఈ రచన వల్ల ఆనాడు శిష్టులమధ్య సాగే లేఖల రచనా విధానం, భాషాధోరణి విదితమౌతున్నాయి.

హాస్య శుభలేఖ

"శ్రీమద్యజనయాజనా (ధ్యయన) అధ్యాపన దాన ప్రతిగ్రహ షట్కర్మ నిరతులయ్యు; మహిషదాన, ఛాగ్రాల(దాన), తిలదాన, గోదాన, భూదాన ప్రతిష్టకులయ్యు; పరధనాపేక్షుతులయ్యు; అగమ్యాగమనులయ్యు; పిండివంట నెత్తిపిడుగులయ్యు; పితురుకార్య దురంధరులయ్యు; వికావాహాన(?) భక్షుకులు

అయ్యి; శల్యపాయస, భోజన ప్రముఖులయ్యి; మధ్యతండి గర్భవాస (?) పరిపూర్ణకులయ్యి; దాసీపుత్ర జనపాలకులయ్యి; బసవవత్రి[1] భక్షకులయ్యి; శిఖపట్ల గోత్ర పవిత్రుకు లయిన్ని; అంగడాల[2] సాంప్రదాయకులయ్యి; అనాయ కేయుకు లాగ్రగణ్యులయ్యి; ఆకతాయి శిరోమణులయ్యి; అంతర శక్తులయ్యి; పైజారుల షుల్లంబొట్లుగార్కి, పాపోజు(సు)ల కొండంబొట్లుగారు మొక్కి, మొక్కలేక మోకాళ్లబడి, తన్నుకుని, గింజుకుని, సత్యం పదివేలుచేసి, చాయంగల విన్నపాలు ॥త॥[3] లొట్టిపిట్ట సంహ్వాత్సర మాఘు ॥శు॥ 30 ఆదివారం వర్కుకుశిక్స్తా[4] క్షేమం ॥త॥ మాఘు శుద్ధ అమావాస్య ఆదివారం రాత్రి, పదహారు ఘడియల వేళ కుంభలగ్నమందు శుక్కల[5] నక్షత్రమందు మధ్యాహ్నంగా చిన్నదాన్కి చిన్నవాన్కి వివాహం తగలబెట్టు తాము గన్క మీకు తెలియకగలందులకు కొనగాల్చి[6] అవాచకుల[7] చేత ముట్టిస్తిమి. ఈ పుత్తర్కు చూచి చూడనట్టుగానె రెండు కావుళ్లు కొత్తకుండలు, కావడుదర్భ, రెండు కంచాల్లు తిలాక్షతలు, నాల్గు బంళ్లె వంట చెర్కు, నల్గురు చిరకేశ ఖండనులు అయ్యి పేరంటాంళ్లు, స్థాలీపాకం నిమిత్తం యేడుగురు బ్రాహ్మలు తక్కువగాకుండా, తొమ్మండుగురు బ్రామ్మల్కు యెక్కువగాకుండా, మీ బత్యం ఖర్చును గురించి షోడశం శప్పాలు[8] యెంటబట్టుకుని మీదారా పుత్రాదులతో పళ్లు వెళ్లగిలబెట్టుకుని, గుడ్లు పెల్లగిల బెట్టుకుని వొడ్డువరిగి దుంపసుద్ధి[9]గా తర్లి(వ)చ్చేడు."

---

1. ఎద్దులు మొదలైనవి తినే గడ్డిగాదర కావచ్చు.
2. 'ఆగడాల'గా, గ్రహించవచ్చు.
3. 'తరువాత'కు సంక్షిప్తలేఖన రూపం.
4. కృశిస్తూ కావచ్చు. లేదా 'శిక్తు' అనే అన్యదేశ్య పదం కావచ్చు.
5. 'శుక్ల' అనిగాని 'శక్ర' అనిగాని లేదా శుక్కల = చుక్కల నక్షత్రం అనిగాని అనుకోవచ్చు, రాత్రి కాబట్టి 'చుక్కల' అనడంలోనే రచయిత హాస్య ధోరణి వ్యక్తమౌతుంది.
6. అశుభ సూచకంగా పత్రికయొక్క కొనను నల్లగా చేయడం.
7. చెప్పరాని వారిచేత.
8. లేతగరిక పోచలు, అయితే ఇక్కడ పరిహాసార్థమే లేఖలో ఉద్దిష్టం.
9. సమూలంగా.

—డా॥ కె. జె. కృష్ణమూర్తి

*19వ శతాబ్దపు శైవకవిశేఖరుడు – అమలాపురపు సన్న్యాసయ్య

పరమశివునకు, ఆయన భక్తజనులకు సంబంధించిన యితివృత్తములను గైకొని, ఆంధ్రసారస్వతమునందలి వివిధ రచనా ప్రక్రియలలో కృతులను వెలయించిన మహాకవులు శివకవులు వీరినే శైవకవులనియు అందురు. వస్తు స్వీకారము, భాషాప్రయోగము—అను రెండు ముఖ్యాంశములలో శివకవు లవలంబించిన దేశీయ దృక్పథము కారణముగా, ఆంధ్రసాహితీ ప్రపంచమున వారిదొక విశిష్టమైన పద్ధతిగా పరిగణింపబడినది.

క్రీ. శ. 11 వ శతాబ్ది చివరి భాగమునుండి, 13 వ శతాబ్ది ప్రారంభము దనుక విస్తరిల్లిన నూటయిరువది యైదేండ్ల కాలములో సుప్రసిద్ధులగు శైవకవు లవతరించి, తెలుగున అనేక కృతి రత్నములను వెలయించిరి. అందుచే ఆ కాల. పరిమితి ఆంధ్రవాఙ్మయ చరిత్రమున 'శివకవియుగము'గా ప్రఖ్యాతిగాంచినది.

అటు తరువాతి యుగములలోను ఆ కోవకు చెందిన 'శివకవులు' మఱి కొందఱు ఆంధ్రావనిలో ఆయాచోటుల అవతరించి, శివభక్తి ప్రచురములైన యుత్తమ రచనలను రచించి, వాఙ్మయమును పెంపొందించియున్నారు క్రీ. శ. 1785 సం॥ ప్రాంతమున జన్మించి, 1860 సం॥ వరకు కవితా జీవిత యాత్రను కొనసాగించిన అమలాపురపు సన్న్యాసికవి అట్టి శైవకవి శేఖరులలో

---

* ఈ పరిశోధన పత్రము 27-12-87 నాడు 5 వ అం. ప్ర. ఓరియంటల్ కాన్ఫరెన్సు (హైదరాబాదు) నందు సమర్పింపబడినది.

అగ్రేసరుడుగా పేర్కొనదగియున్నాడు. కళింగాంధ్ర దేశమున బొబ్బిలికి సమీపమున గల 'పాలతేరు' ఈతని జన్మస్థలము. గంగమాంబ, కాశీపతి యీతని తల్లి దండ్రులు; దీక్షాగురువు కల్యాణము త్రిపురాంతకుడు; విద్యాగురువు కట్టమూరి కామేశ్వరకవి.

సన్న్యాసికవి సారస్వతపోషకులుగా ప్రశస్తిగనిన సాలూరు సంస్థానాధిపతులచే సమాదరింపబడి, అచ్చటి వేగవతీ నదీతీరమున వెలసియున్న పంచముఖేశ్వరునకు తన రచనలను సమర్పించిన ధన్య చరితుడు. శతాధిక కృతి కర్తగా పేరు గాంచినవాడు.

'శ్రీమత్పంచముఖేశ్వరానశ్వర శశ్వదనుకంపాసంపాదిత కవిత్వ మహత్త్వ సంపత్సంపన్న'డైన సన్న్యాసి కవీంద్రుడు రచించిన యనేక కృతులలో నేటికి తెలియవచ్చినవి పండ్రెండు.

1) పంచముఖేశ శతకము. 101 కందములు, 'పరమకృపారస విశేశ ! పంచముఖేశా !'— అను నాలుగవ పాదము మకుటము. శతకమంతయు శకార—ఏకప్రాసతో రచింపబడినది.

2) గౌరీరమణశతకము, 101 కందపద్యములు 'కైలాస నగేంద్రమరణ ! గౌరీరమణా !'— అనెడి చతుర్థపాదము మకుటము, శతకమంతయు లకార ఏకప్రాస.

3) శ్రీముఖలింగ శతకము, 108 కందములు. వంశధారా నదీతీరము నందలి ముఖలింగ క్షేత్రమున నెలకొనియున్న మధూకేశ్వరునిపై రచింపబడిన కృతి, శతకమంతయు ద్విప్రాసకలది. ముఖలింగ క్షేత్రమునకు 'జయంతీపుర'మను నామాంతరమున్నటుల ఈ శతకమువలన తెలియుచున్నది.

4) శివశతకము, 128 కందములు, శతకమంతయు ద్విప్రాస ఘటితము.

5) పంచముఖేశ్వరప్రభు శతకము 109 చంపకోత్పలములలో విరచింపబడినది.

చ॥ మఱిసి శివా! యటంచు నొకమాఱు స్మరింప, సహస్ర జన్మ సం
చిత దురితం బడంగునని శిష్టజనంబులు దెల్పఁగా, సనా
రతము నహర్నిశల్ మది విరామము లేక నినున్ భజింప, ని
ష్కృతిఁ దునిఁ జేయ వేటికి? కృపానిధి! పంచముఖేశ్వర ప్రభూ!
—58 ప.

దీనిఁబట్టి, ఈతడు సంతత శివనామ జపతత్పరుఁడగు పరమ మాహేశ్వరుడను విషయము వెల్లడియగుచున్నది.

6) కాశీవిశ్వనాథ శతకము. 116 సీసపద్యములు. ఈ కవి సకటుంబముగ కాశీక్షేత్రమును సందర్శించిన సమయమున రచియించిన రమణీయ కృతి. 'భూరిగుణయూథ! కాశికాపుర సనాథ! విదళితామర్త్యరిపుయూథ! విశ్వనాథ!' అను మకుటముగలది. కాశీక్షేత్రముపై తెనుగున వెలువడిన భక్తి శతకములలో అగ్రగణ్యమైయున్న ఈ శతకమునుండి మచ్చున కొక పద్యము:

సీ॥ కరికాలుఁ డొసఁగు మాకందఫలంబులు, మిక్కుటంబగు కూర్మి మెక్కి మెక్కి,
మాదర చెన్నాఖ్యుఁ డాదరంబునఁ బెట్టు, సురుచిరాంబకళంబు జుర్రి జుర్రి,
నిమ్మవ్వ మదిఁ బత్తి నివ్వటిల్లఁగఁ బోయు, జావ సంతసమునఁ ద్రావి త్రావి,
బోయకన్నఁడు ఎడఁబాయక యర్పించు, నంజుడు తునకలు నమలి నమలి,
గీ॥ తృప్తిదీరక, భిక్షాంప్రదేహి యనెదు; జనులు దీర్తురె క్షుత్తు విశ్వంభరునకు
భూరిగుణయూథ! కాశికాపుర సనాథ! విదళితామర్త్య రిపుయూథ!
విశ్వనాథ! — 34 ప.

7) రామోగావళి. 30 కందపద్యములు. ఈ కవి రామేశ్వరక్షేత్రమున కేగినప్పుడు రచించిన లఘు కృతి. 'రామేశా!' యనునది మకుటము.

8) పంచముఖేశలింగ స్తుత్యంచిత ద్వాత్రింశత్తు. 32 సీసపద్యములు. 'భుజగకేయూర! సాలూరు పురవిహార! ఈశ! భవభంగ! పంచముఖేశ లింగ!'— అనునది యిందలి మకుటము.

9) రుద్రాక్షమాహాత్మ్యము. ఇది రుద్రాక్ష ఫలముయొక్క మహిమను దెలిపెడు మూడాశ్వాసముల శైవ ప్రబంధము. పంచముఖేశ్వరస్వామి కంకితము. ఇందలి కథ పద్మపురాణమునుండి స్వీకరింపబడినది.

10) సోమవాసర మాహాత్మ్యము. సోమవార వ్రతముయొక్క విధానమును, తన్మాహాత్మ్యమును ప్రకటించెడి మూడాశ్వాసముల శైవప్రబంధము. నిత్య సోమవారవ్రత దీక్షాదక్షుడైన సన్న్యాసి కవీశ్వరుడు స్వానుభవ పురస్సరముగా, భక్తిభావ బంధురముగా రచియించిన కమనీయ మాహాత్మ్యకావ్య మిది.

11) గుండయ్య చరిత్రము. ఇదియొక శైవప్రబంధము పాల్కురికి సోమనాథుని బసవపురాణమున చతుర్థాశ్వాసములో గల 'కుమ్మర గుండయ్య కథ' యిందులకు మూలము. తమిళ వాఙ్మయమునందలి అఱువది మువ్వురు శైవనాయనారులలో నొకడైన 'తిరునీలకంఠ నాయనారు'నకు తెనుగులో 'గుండయ్య' యని నామధేయము. స్వకులజుడైన పురాతన శివభక్తాగ్రగణ్యుం డనెడి సాత్త్వికాభిమానముచే కాబోలు, సన్న్యాసికవి, బసవపురాణమున అత్యంత సంగ్రహముగానున్న యీ భక్తకథాంశమును స్వీకరించి, చక్కని ప్రబంధముగా దిద్ది తీర్చియున్నాడు.

12) సర్వాంధ్రసార సంగ్రహము. ఇది యాంధ్రనామ సంగ్రహము వంటి యొక పద్యరూప నిఘంటువు. పంచముఖేశున కంకితము. క్రీ. శ 1801–1830 సంవత్సరముల నడుమ సాలూరు సంస్థానమును పాలించిన కిమ్మూరి సన్న్యాసి రాజునకు జ్ఞాతియు, వరుసకు తమ్ముడు నయిన కిమ్మూరి జగన్నాథ మానవేంద్రుని (క్రీ. శ. 1820–1890) యాదేశము ననుసరించి, సన్న్యాసికవి యీ నిఘంటువును సమకూర్చియున్నాడు.

ఈ నిఘంటు రచనలో అమలాపురపు కవికి, గణపవరపు వేంకటకవి (క్రీ. శ 17 వ శతాబ్ది మధ్యభాగము) రచించిన 'వేంకటేశాంధ్రము', సుదురుపాటి వేంకనార్యుని (క్రీ. శ. 18 వ శతాబ్ది పూర్వార్థము) 'యాంధ్రభాషార్ణవము'— అను నిఘంటువులు మార్గదర్శకములైనవి. ఒకవిధముగా ఈతని 'సర్వాంధ్రసార సంగ్రహము' వేంకనార్యుని 'యాంధ్ర భాషార్ణవము'నకు సంక్షిప్త రూపమని చెప్పదగియున్నది. 589 గద్య పద్యములలో, మూడాశ్వాసములుగా విస్తరించియున్న ఈ కృతి, అవతారిక, ఆశ్వాస విభజనము— ఇత్యాది కావ్యలక్షణములనుబట్టి, ఇదియొక "నిఘంటు కావ్యము"గా పేర్కొనదగియున్నది.

సన్యాసి కవిశేఖరుడు 'ప్రమథ గణమాలిక' యను మఱీ యొక గ్రంథమును గూడ రచించియున్నటుల 'వీరశైవాంధ్రవాఙ్మయ' మనెడి పరిశోధన గ్రంథమున క్రీ. శే. శిష్టా రామకృష్ణశాస్త్రిగారు పేర్కొన్నారు. కాని యీ కృతి నేడు మృగ్యము.

శతకము, మాహాత్మ్య కావ్యము, ప్రబంధము, నిఘంటువు— మొదలగు వేర్వేఱు ప్రక్రియలలో అనర్గళశైలీ సముల్లసితములైన మనోజ్ఞకృతులను వెలయించుటద్వారా ఆంధ్రవాఙ్మయమునకు, అందులోను ముఖ్యముగా శైవ వాఙ్మయమునకు పెంపు గూర్చిన యీ శైవ కవిశేఖరుని సారస్వతమూర్తి మత్త్వము (Literary Personality) సమకాలీన విద్వత్కవులయిన తుమురాడ పాపకవి, దేవులపల్లి చంద్రశాస్త్రి మున్నగువారి ప్రశంసా పద్యమాలికల నుండి సేకరించిన యీ క్రింది వివిధాంశముల మూలమున సుస్పష్ట రేఖలతో మఱింత మహనీయముగా భాసిల్లుచున్నది :

i) సన్యాసికవి పద్య, గద్యమయములైన హరకథలను విబుధ సంఘములు బళిబళీ! యని ప్రస్తుతించునటుల, సద్భక్తి మెఱయ, శ్రావ్యముగా చదివి వివరించు నైపుణ్యము గలవాడు.

ii) లలితమౌ నాటకాలంకార సాహితీ చతురవైభవము, సకల జనామోద సంధానకరమైన ఆంధ్రభాషా విలాసము, గోష్ఠినీ పరిపాక కోమల

కవితా చమత్కార భూరి సామర్థ్యము - ఇవన్నియు కలిగి, విద్యలలో జాణయైన విద్వల్లలాముడు.

iii) ధర్మాత్మక విపుల తాత్పర్య మొప్పగా కాశి మొదలైన పుణ్య క్షేత్రములకు యాత్రలు సలిపి, ఆయా అధిదైవములపై శతకములు మొదలైన భక్తిరసమయ స్తుతి రచనలు గావించిన భక్తవరేణ్యుడు.

iv) అఖిలవ్రతాధికమైన నిత్య సోమవార మహావ్రతమును నిర్వహించి చతుర్విధ పురుషార్థములను సముపార్జించిన శైవదీక్షా ధురంధరుడు.

v) అకలంక వృత్తిని సకలాంధ్రభాషా విశేషజ్ఞుడై, నిజశిష్య సంచయమునకు మహాప్రసాదమొదవునట్లు కరతలామలకముగా అన్ని విద్యలను గఱపిన వివేకాత్ముడు

vi) శ్రీమద్రామాయణమును వ్రాసి, శ్రీరామ పట్టాభిషేకమును నిర్వహించిన ధన్యుడు.

vii) తన వంశకర్తయై తనరారు శాలివాహన మహారాజ శకాబ్దములు కరగజర్షి విధుసంఖ్య (1782) దగు రౌద్రి వత్సర చైత్ర శుద్ధ నవమీ మిత్రపుత్రి వారమునాడు, 'ఇట్టి పురుషుండు ధాత్రి గలడె!' యనుచు జనులెల్ల నొక్కటై యభినుతింపగా, సముజ్జ్వలముగ లింగైక్య మొందిన పుణ్యాత్ముడు.

తాళపత్రప్రతుల రూపమున 'మఱుగుపడ్డ మాణిక్యములుగా' నున్న ఈ కళింగాంధ్ర కవీశ్వరుని కృతులు అవశ్యము ముద్రణ భాగ్యము నొందింపదగియున్నవి.

ఆధార గ్రంథములు

1. R. 534 (తాళపత్ర ప్రతి) రుద్రాక్ష మాహాత్మ్యము.
2. R. 581 (కాగితపు ప్రతి) శ్రీముఖలింగ శతకము etc.
3. R. 611 (కాగితపు ప్రతి) సర్వాంధ్రసార సంగ్రహము.
4. R. 828 (తాళపత్ర ప్రతి) సోమవార వ్రత మాహాత్మ్యము.

5. R. 1669 (కాగితపు ప్రతి) గుండయ్య చరిత్రము.

[పై అయిదు వ్రాతప్రతులు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయము నందలివి].

6. శతకకవుల చరిత్రము - పండిత వంగూరు సుబ్బారావు (1924)

7. A Triennial Catalogue of Manuscripts, Vol. IV-Part 3 - Telugu, G. O. M. Library, Madras (1934).

8. వీరశైవాంధ్ర వాఙ్మయము - శిష్టా రామకృష్ణశాస్త్రి (1952).

9. ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము.

—డా॥ తూమాటి దోణప్ప, ఎం.ఏ., పిహెచ్.డి., వాల్తేరు (1969).

— డా॥ కొల్లాగుంట ఆనందన్.

భారత కథలలో కడబలి రాముని వృత్తాంతం

తమిళదేశంలో వసంతకాలంలో "ద్రౌపది అమ్మన్ తిరువిళా" (ద్రౌపది దేవి ఉత్సవాలు) జరుగుతాయి. ఈ ఉత్సవాలు ప్రధానంగా తమిళనాడులోని చెంగల్పట్టు, ఉత్తరఆర్కాడు, దక్షిణఆర్కాడు, కోయంబత్తూరు జిల్లాలలోను, ఆంధ్రదేశంలో చిత్తూరు జిల్లాలో కొన్ని ప్రాంతాలలోను, నెల్లూరు జిల్లాలో నెల్లూరు, గూడూరు మొదలైన ప్రదేశాలలోను జరుగుతాయి. పల్లెప్రజలే ఈ ఉత్సవాలలో ఎక్కువగా పాల్గొంటారు. ఈ ఉత్సవాలు 18 రోజులు జరుగుతాయి. అందులో భారత యుద్ధఘట్టాల్ని కడపటి మూడురోజుల్లో ప్రదర్శిస్తారు. 16 వ రోజు యుద్ధారంభానికి ముందు, మట్టితో చేసిన ఒక ఎత్తైన 'కడబలిరాము'ని విగ్రహాన్ని బలి ఇస్తారు.

'కడబలిరాము'ని 'కళబలిరామన్', అరవణన్, ఇరావంతుడు అని కూడ పిలుస్తారు. 'కళబలి' అంటే యుద్ధబలి అని అర్థం. యుద్ధానికి బలి ఇస్తారు కాబట్టి 'కడ (ళ) బలిరాము' డయ్యాడు. జానపదుల కథనాన్నిబట్టి అర్జునునికి ఉలూచియందు పుట్టిన ఇరావంతుడే కడబలి రాముడు. 'ఇరా' అంటే తమిళంలో పాము అని అర్థం. ఉలూచి అనే నాగకన్యక గర్భాన పుట్టాడు కాబట్టి ఇరావంతుడైనాడు.

సంస్కృతాంధ్ర భారతాలలో ఇరావంతుని వృత్తాంతం ఉంది. ఇతడు భారత యుద్ధంలో పాల్గొని అవక్ర పరాక్రమాన్ని ప్రదర్శించాడు. ఆలంబసునికి,

ఇతనికి యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఇరావంతుడు చంపబడ్డాడు. ఇతడు యుద్ధబలిగా తనను అర్పించుకొన్నట్లు తమిళ భారతంలోను, జానపద గాథల్లోను ఉంది. ఈ వృత్తాంతం సంస్కృత ఆంధ్ర భారతాలలో కన్పించదు. తమిళ భారతాలలో ఇరావంతుడు ధీరోదాత్తుడుగ మహాపరాక్రమ సంపన్నుడుగ, గొప్పత్యాగిగా చిత్రింపబడ్డాడు.

తమిళంలో ప్రసిద్ధిచెందిన భారతం 'విల్లిపుత్తూరార్ భారతం : ఈ విల్లిపుత్తూరార్ క్రీ. శ. 1331 నుండి 1383 వరకు దక్షిణ పెన్నానదీ తీరంలోని తిరుమునై పాడి దేశపురాజు 'వక్కై-పాగై వరపది యాడ్కొండాన్' అనే చోళ సామంతరాజు ఆస్థానంలో ఉండేవాడు. ఆరాజు ప్రోద్బలంతో ఈ కవి భారతాన్ని తమిళంలోనికి అనువదించాడు. ఇందులో ధర్మరాజు సింహాసనాధిష్టుడయేంతవరకు గల కథ వర్ణింపబడింది. ఈ భారతంలో ఉద్యోగ పర్వాంతంలో ఇరావంతుని వృత్తాంతం ఉంది. ఇరావంతుడు గొప్ప పరాక్రమవంతుడుగ చిత్రింపబడ్డాడనడానికి విల్లిపుత్తూరార్ భారతంలోని ఓ రెండు పాటల్ని పరిశీలిస్తాము.

భీష్ముడు దుర్యోధనునికి ఇరావంతుని గూర్చి చెబుతూ.

"ఒంన్ర నమ్ పడైగళెల్లాం ఒరు పగర్ పొళుదిల్ కొల్వాన్"—
అంటాడు.

అంటే ఇరావంతుడు ఒక్కడే మనసైన్యాన్ని ఒక్క పగటిపూటకు చంపగలడని భావం.

ఇంకా,

"తెవ్వర్ కొట్ర వెంబడై అనైత్తుం ఓర్ అంబినాల్ కొల్వన్ ఓర్
దినత్తు ఎన్రాన్".

విరోధుల గొప్పసైన్యాన్ని అంతా ఒకే ఒక బాణంచేత ఒకేదినంలో చంపగలడని భావం. పై పాటలవల్ల ఇరావంతుడు గొప్పశక్తి సంపన్నుడుగా కీర్తింపబడినాడని తెలుస్తోంది.

ఈ ఇరావంతుని గూర్చి తమిళ భారతంలోగల కథను పరిశీలిస్తాం.

విల్లిపుత్తూరార్ తన భారతం (విల్లిపుత్తూరార్ భారతం)లో తమిళదేశ జనవ్యవహారంలో ఉన్న కథలనుకూడ తీసికొని రచించాడు. అలాంటి కథలలో ఇరావంతుని వృత్తాంతంకూడ ఉంది.

కురుక్షేత్ర యుద్ధం ఆసన్నమైంది దుర్యోధనుడు "కళబలి"కి తగిన వారెవ్వరు ? కళబలి ఇవ్వడానికి తగిన ముహూర్తమేది ? అని భీష్ముణ్ణి ప్రశ్నించాడు. భీష్ముడు "మన ఉభయ సేనల్ని చంపగలవాడు ఇరావంతుడు. అతన్ని బలిగా ఇస్తే నీకు జయం చేకూరుతుంది. దానికి ముహూర్తం సహదేవుని అడగ"మని చెప్పాడు. తాను అడిగితే సహదేవుడు ముహూర్తాన్ని నిర్ణయించి ఇవ్వగలడా ? అన్న సందేహాన్ని వ్యక్తపరిచాడు దుర్యోధనుడు. సహదేవుడు పరిశుద్ధుడని, అడిగిన తక్షణం తప్పక శుభలగ్నం చెబుతాడని భీష్ముడు చెప్పాడు. వెంటనే విశ్వకర్మ సహాయంతో ఒకరథాన్ని సంపాదించి అందులో ఉపప్లావ్యానికి వెళ్ళాడు. సహదేవుడు దుర్యోధనుని రాకకు కారణం తెలుసుకొని శుభముహూర్తాన్ని నిర్ణయించి పంపాడు. అటు పిమ్మట దుర్యోధనుడు ఇరావంతుని గృహానికెళ్ళాడు. ఇరావంతుడు తన పెదతండ్రిని పూజించి అతడు వచ్చినకారణం అడిగాడు. దుర్యోధనుడు ఇరావంతుని రక్తాన్ని కోరాడు. అడిగిన వారికి లేదనక ఇచ్చే ఇరావంతుడు ఇప్పుడైనా మరెప్పుడైనా తన రక్తాన్ని తీసుకోమన్నాడు. దుర్యోధనుడు అమావాస్యరోజు ఇరావంతుని బలి ఇవ్వాలని ఆ రోజు కొరకు ఎదురు చూడసాగాడు.

ఇంతలో జరిగిన వృత్తాంతాన్ని కృష్ణుడు పసికట్టాడు. వెంటనే ధర్మజాదులను కలిసి కర్తవ్యబోధ చేశాడు. లోకంలో సర్వలక్షణ సంపన్నులు తాను, ఇరావంతుడేనని, ఇరావంతుడు దుర్యోధనునికి బలికానున్నాడు కాబట్టి తనను బలిగా ఇవ్వమంటాడు. వెంటనే పాండవులు, కృష్ణసహితంగా ఇరావంతుని దగ్గరికి వెళ్ళారు. ఇరావంతుడు వారు వచ్చిన కారణాన్ని తెలిసికొని తాను దుర్యోధనునికి ఇచ్చిన మాటకు భంగం కలుగకుండా చేసుకొనే పక్షంలో తాను పాండవపక్షాన బలికావడానికి సిద్ధమేనంటాడు. కృష్ణుడు వంచనతో ఇరావంతుని ఒప్పించి అమావాస్యను చతుర్దశి రోజే కల్పిస్తానంటాడు. కర్తవ్యపరాయణుడైన కృష్ణుడు, వెంటనే తమ పితృదేవతలకు తర్పణం వదలుతాడు. తర్పణం అమావాస్యరోజే ఇవ్వాలి. కాని దానికి వ్యతిరేకంగా కృష్ణుడు చతుర్దశి

రోజు తర్పణం ఇస్తున్నాడు. ఈ విడ్డూరాన్ని చూడడానికి సూర్యచంద్రాదులు, ఎప్పుడైతే ఒకచోట కలుస్తారో అదే అమావాస్య. కాబట్టి ఆరోజే ఇరావంతుని 'కళబలి' కమ్మని కృష్ణుడు చెప్పాడు. ఇరావంతుడు తనకు యుద్ధాన్ని చూచే భాగ్యాన్ని కలుగజేయమని కృష్ణుని అర్థిస్తాడు. కృష్ణుడు సరే నంటాడు. ఆతర్వాత ఇరావంతుడు అమావాస్యరోజు అర్ధరాత్రి కాళీ విగ్రహానికి తనను తానే బలి ఇచ్చుకొన్నాడని విల్లిపుత్తూరార్ భారతం చెపుతుంది.

ఇక జానపద సాహిత్యంలో రెండువిధాలైన కథలు వినిపిస్తూ ఉన్నాయి. రెండింటిలోను కృష్ణుని కపటరాజనీతి ప్రదర్శిత మౌతూఉంది.

పాండవులు వనవాసానంతరం యుద్ధానికి వెళ్ళుతూ ఉన్నారు. మార్గ మధ్యంలో భూతప్రేతాదులు వారిని ఆటంకపరిచాయి. పాండవులు, యుద్ధంలో కోరినంత ఆహారాన్ని ఇస్తామని వాటిని ఒప్పించి పంపేశారు. కృష్ణుని అను మతితో కాళికాదేవి సంప్రీతి కొరకు దేవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దేవిని సంతృప్తి పరచడానికి బలి అర్పించాలని, ఆ బలికి సర్వలక్షణ సంపన్నుడు, తొలిచూలు బిడ్డ బ్రహ్మచారి, ఎదురురోమాలు కలిగినవాడు అయిన ఓ యువకుడు కావాలి. బలి అర్పించడానికి తన శరీరాన్ని ఆవ్యక్తి సంతోషంగా ఇవ్వాలి అని చెప్పాడు. పై లక్షణాలు అన్ని కలిగినవాడు ఉలూచి, అర్జునుల కుమారుడు ఇరావంతుడని కూడ సూచించాడు. ఇరావంతుడు బలికి సంతోషంగా ఒప్పుకొన్నాడు. కాని భారతయుద్ధాన్ని ఆద్యంతం చూడాలని కూడ కోరాడు. శ్రీకృష్ణుడు అతని కన్నులు మాత్రం 18 రోజులు యుద్ధాన్ని చూచేటట్లు వరమిచ్చి అతన్ని దేవికి బలి ఇచ్చారు.

జనవ్యవహారంలో మరోకథకూడ ఉంది. కృష్ణుడు ఒకరోజు అడవుల వెంబడి నడుస్తూ ఉన్నాడు. ఒకచోట ఇరావంతుడు రెండు కొండలపై ఆకొండపై ఒకకాలు ఈ కొండపై ఒకకాలు ఉంచుకొని తన తొడపై కత్తికి పదనుపెడుతూ ఉన్నాడు. ఆ దృశ్యాన్ని చూచిన కృష్ణుడు ఇరావంతుడు అలా కత్తిని పదను పెట్టడానికి కారణమడిగాడు. 'ఈ రాబోవు భారత యుద్ధంలో మాశత్రువులను (కౌరవులు) చంపడానికి కత్తికి పదనుపెడుతూ ఉన్నా' నన్నాడు. 'నీ కత్తికి అంత పదనుఉందా' అని కృష్ణుడు తన సందేహాన్ని వ్యక్తం చేశాడు. వెంటనే ఇరావంతుడు తన కత్తిని ఓ మర్రిచెట్టుపై విసిరాడు.

ఆ మర్రిచెట్టులో ఆరుకొమ్మలు తప్ప మిగిలినకొమ్మలన్నీ తెగి క్రిందపడ్డాయి. ఆ ఆరుకొమ్మలు ఎందుకు మిగిలాయి, అని మరలా కృష్ణుడు తన సందేహాన్ని వ్యక్తం చేశాడు. ఆ ఆరు కొమ్మల్లో ఐదు పంచపాండవులని మరొకటి శ్రీకృష్ణుడని ఇరావంతుడు చెప్పాడు. అంటే భారతయుద్ధంలో మిమ్మల్ని ఆరుమందిని మినహా శత్రుసేనల్ని అంతా నిర్మూలిస్తానన్నాడు. కృష్ణుడు ఆలోచనలో పడ్డాడు. ప్రస్తుతం తాను పాండవుల పక్షాన ఉన్నాడు కాబట్టి సరిపోయింది. ఒకవేళ తాను దుర్యోధనుని పక్షాన ఉండిఉంటే తననుకూడ ఇరావంతుడు వదిలేవాడు కాడని భావించిన కృష్ణుడికి వంటిలో దడపుట్టింది. ఎలాగైనా వీనిని (ఇరావంతుడు) చంపించాలనుకొన్నాడు. ఆ తర్వాత సహదేవుడు ముహూర్తం నిర్ణయించడం, దుర్యోధనుడు తన పక్షాన ఇరావంతుని బలికి సిద్ధంగా ఉండేటట్లు ఒప్పించడం, అమావాస్యసృష్టి, ఇరావంతుని బలి ఇవన్నీ మొదటి రెండు కథల్లాగే నడుస్తాయి. అయితే ఇందులో మనకు మరొక క్రొత్తవిషయం తెలుస్తుంది ఇరావంతుడు యుద్ధాన్ని చూస్తూ ఉండడమే గాక తన పక్షాన ఉన్నవారికి ఉద్రేకాన్ని కలుగజేస్తూ ధైర్యాన్ని ఇచ్చాడని చెపుతారు. అభిమన్యుని పద్మవ్యూహ ఘట్టంలో అతని యుద్ధాన్ని మెచ్చుకోవడమే గాక అతనికి ధైర్యాన్ని ఉత్సాహాన్ని కలిగించాడని, ఒకసారి అభిమన్యుని సాయం కోసం వెళ్ళి తన మొండెంతోనే కొన్ని అక్షౌహిణుల సైన్యాన్ని చంపాడని జానపదుల ఉవాచ.

జానపదులు వీర, అద్భుత రసప్రియులు. వారి అభిరుచి ననుసరించి వారు ఎన్నోకథల్ని అల్లుకొన్నారు. కొన్ని పాత్రల్ని సృష్టించుకొన్నారు. వాటిని ఆరాధించారు, పూజించారు. శక్తిపూజ కూడ జానపదులనుండే వచ్చింది. ద్రౌపది శక్తిస్వరూపిణి అన్న అంశంకూడ జానపదులదే. ఏదైనా ఒకపని తలపెట్టేముందు శక్తిపూజచేసి బలి అర్పించడంకూడ జానపదులనుండి వచ్చింది. ఈ కథలో ప్రతిఅంశం జానపదుల నమ్మకం అలవాట్లను ద్యోతకమొనర్చుతాయి. వీటిని ఆధారం చేసుకొని కథ అల్లబడింది. ఆదివారం. అమావాస్య అర్థరాత్రి శక్తిపూజ చేస్తే తాము అనుకొన్నవన్నీ నెరవేరతాయని భావించడం కూడ జానపదుల విశ్వాసమే. తొలిచూలు కాన్పును బలిఇస్తే దేవికి (శక్తికి) ప్రీతిపాత్రంగా ఉంటుందని భావించడంకూడ జానపదుల నమ్మకమే.

ఈ నమ్మకాలు అన్నీ ఈ 'కడబలి' రాముని కథలో చోటు చేసుకొన్నాయి. ఈ కథలో వీర, అద్భుత రసాలు చోటు చేసుకొన్నాయి. ఇరావంతుడు తనను తానే బలి ఇచ్చుకోవడం వీరరసాన్ని, చతుర్దశిరోజే అమావాస్యను కల్పించడం, మొండెంతోనే కొన్ని అక్షౌహిణుల సైన్యాన్ని రూపుమాపడం మొదలైన ఘట్టాలు అద్భుతరసాన్ని వ్యక్తీకరిస్తాయి.

జానపదుల కథల్ని పరిశీలిస్తే సాహిత్యంలో అనాదృతంగా వదిలి వేయబడ్డ కొన్నిపాత్రల్ని గొప్పగా చిత్రించి వారి మానసిక ప్రవృత్తి కళ్ళకు కట్టినట్లు వర్ణింపబడింది. ఇలాంటి పాత్రల్లో ఊర్మిళ, మండోదరి, కడబలి రాముడు, సహదేవుడు మొదలైనవెన్నో ఉన్నాయి. కడబలి రాముడు కేవలం ఒకసైనికుడుగ భారతంలో చిత్రింపబడ్డాడు. కాని జానపదుల ఊహా ప్రపంచంలో అతడు గొప్పత్యాగి, మహాపరాక్రమ సంపన్నుడు. జానపద సాహిత్యంలోని ఇలాంటి పాత్రల వైశిష్ట్యాన్ని పండితలోకానికి తెలియబరచ వలసిన అవసరం ఎంతైనాఉంది.

ఉపయుక్త సమాచారం :—

1. తమిళాంధ్ర భారతముల తులనాత్మక పరిశీలనము.

—వి. యన్. రాఘవన్.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1982

2. విల్లిపుత్తూరార్ భారతం.

3. నంగమంగళం గ్రామంలో మహాభారత యజ్ఞం. — నవభారతి. 1977

4. S. R. పురంమండలం, నాయుడుపల్లె గ్రామం. గవరమ్మ దగ్గరనుండి సేకరించిన విషయాలు,